బోనాలకు ఆలయాలు ముస్తాబు

20న బోనాలు, 21న రంగం, ఘటం

బోనాలకు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 20, 21వ తేదీల్లో వేడుకలను వైభవంగా నిర్వహించడానికి ఆలయాల నిర్వాహకులు భారీస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవడానికి సంబంధిత శాఖల అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయాల వద్ద, ఆయా ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు.

బోనాల ఉత్సవాలకు నిధుల కేటాయింపు : వీహెచ్



మాజీ ఎంపీ వీహెచ్‌కు బోనాల ఆహ్వానపత్రం అందజేస్తున్న అంబర్‌పేట దేవస్థాన ప్రతినిధులు

నల్లకుంట, జూలై 17(ఆంధ్ర జ్యోతి): ఆషాఢ మాసంలో బోనాల ఉత్సవాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని దేవాలయాలకు నిధులు కేటాయించిందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. తద్వారా నగరంలోన్ని అన్ని దేవాలయాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అంబర్‌పేట దేవస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో అంబర్‌పేట మహాకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ గురువారం మాజీ ఎంపీ వీహెచ్‌కు బాగ్‌అంబర్‌పేటలోని ఆయన నివాసంలో సమితి సభ్యులు ఆహ్వానపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, వై.శంకర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, చెంగలి సుధాకర్, దొమకొండ కిషోర్, నక్కా జలంధర్‌గౌడ్, రావుల సుధాకర్ పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద హెల్త్ క్యాంపులు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న క్లస్టర్ డాక్టర్ పద్మజ, డాక్టర్ మనోజ్ రెడ్డి

ముషీరాబాద్, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): త్వరలో జరగనున్న బోనాల ఉత్సవాల సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి అమ్మవారి దేవాలయం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని అంబర్‌పేట క్లస్టర్ డాక్టర్ బి.పద్మజ తెలిపారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో బోనాల పండుగను పురస్కరించుకుని రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 16 ప్రధాన అమ్మవారి ఆలయాల తోపాటు బస్తీలు, కాలనీల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్ దీప్తి పటేల్, డాక్టర్ మౌనిక, డాక్టర్ హరిశ్రీ, డాక్టర్ కౌశర్, డాక్టర్ హాసిని, డాక్టర్ శివ, డాక్టర్ జులాని తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ డివిజన్‌లో చెత్త, మట్టి తొలగింపు



మట్టి చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): బోనాల పండగ సందర్భంగా రాంనగర్ డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద చెత్త, మట్టి కుప్పల తొలగింపు కోసం జీహెచ్‌ఎంసీ గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఇందులో భాగంగా డివిజన్‌లోని బాకారం శ్రీపోచమ్మ ఆలయం వద్ద నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో కార్పొరేటర్ కె.రవిచారి చెత్త, మట్టికుప్పల తొలగింపు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



ముస్తాబవుతున్న ముషీరాబాద్ మహాకాళి దేవాలయం

భక్తుల కొంగుబంగారం మహాకాళి అమ్మ

ముషీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ మహాకాళి అమ్మవారు భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఆషాఢమాసం బోనాల ఉత్సవాలను ఈ సారి వైభవంగా నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు రంగులు వేస్తున్నారు. ధ్వజస్తంభాన్ని శుభ్రంచేశారు. ఆలయ ప్రాంగణంలో గల 9దేవతా మూర్తుల ప్రతిమలకు రంగులేశారు. ఈనెల 20న బోనాలు, 21న రంగం, ఘటం వీడ్కోలు పూజాకార్యక్రమాలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రసిద్ధిగాంచిన దేవాలయం కావడంతో బోనాల వేడుకలకు కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు హాజరు కానున్నారు.



గంగానగర్‌లోని దేవాలయాలకు రంగులేస్తున్న దృశ్యం

● గోల్నాక: గోల్నాక డివిజన్‌లోని గంగా నగర్‌లో గల మహాకాళి, బంగారు మైసమ్మ దేవాలయాలను బోనాల ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ఆలయ కమిటీ వారు తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 20, 21 తేదీల్లో జరిగే బోనాల వేడుకలకు దేవాలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు పెద్దఎత్తున బోనాల ఉత్సవాలకు తరలివస్తారన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నిఏర్పాట్లను చేస్తున్నారు. ఈనెల 20న బోనాలు, 21న బలిగంప, తెలంగాణ జానపద కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్

రాంనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జోనల్ పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట, సనత్‌నగర్, సికింద్రాబాద్ నియోజకవర్గాలలో బోనాల పండగ, వర్షా కాలం నేపథ్యంలో అమ్మవారి ఆలయాల వద్ద మౌలిక వసతుల కల్పనలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ సూచించారు. వర్షాకాలంలో వర్షం వల్ల వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గురువారం సికింద్రాబాద్ జోనల్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండగ సందర్భంగా నిర్వహించే ఫలహారం బండ్ల ఊరేగింపు మార్గంలో చెట్ల కొమ్మలు, విద్యుత్ వైర్లు తగలకుండా చూడాలన్నారు. వీధిదీపాలు వెలిగేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్లకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, బ్లాక్ స్పాట్ నిర్మించాలని సూచించారు. రోడ్ల వెడల్పు, ప్రధాన కూడళ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. బోనాల పండగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ రాహుల్ హెడ్డీ, ట్రాఫిక్ ఏసీపీలు శ్రీనివాస్, శంకర్‌రాజు, జీహెచ్‌ఎంసీ మెయింటెనెన్స్ ఎస్ఈ ఆశాలత, సిటీ ప్లానర్ శ్రీనివాస్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి, అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతిదివాకర్, సర్కిల్ 28 డీఎంసీ జగియాసుల్తానా, సర్కిల్ 29 డీఎంసీ ఆంజనేయులు, సర్కిల్ 30 డీఎంసీ దుక్కు నాయక్, జోనల్ పరిధిలోని ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రవికిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న కాచిగూడ ఏసీపీ హరీష్ కుమార్

వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి

కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్

అంబర్‌పేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న అంబర్‌పేటలో ప్రజలు జరుపుకునే బోనాల వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్ సూచించారు. అంబర్‌పేట పీఎస్ పరిధిలో బోనాల వేడుకల నిర్వాహకులతో గురువారం ఏసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల పండగను శాంతియుతంగా జరుపుకోవడానికి సహకరించాలని కోరారు. సున్నిత ప్రాంతాలలో అదనపు బందోబస్తు కల్పిస్తున్నట్లు తెలిపారు. దేవాలయాల నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో భారీ ఏర్పాట్లు

కవాడిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ బోనాలు వైభవంగా నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 20న బోనాలు, 21న రంగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ గోల్కొండ గౌతమ్‌కుమార్ పటేల్, ఆలయ ఈవో సాంబశివరావు, ప్రధానఅర్చకులు సాత్విక్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ తెలిపారు. కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో బోనాల పండగ బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. దేవాలయానికి వచ్చే భక్తులు బోనాల సమర్పించి, మొక్కులు తీర్చుకునేవారికి సమీపంలో ఉన్న స్థలంలో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



పారిశుధ్యంపై జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ పద్మ

చెత్త, మట్టికుప్పలను తొలగించాలి

రాంనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో రోడ్లపై చెత్త, మట్టికుప్పలను పారిశుధ్య సిబ్బంది తొలగించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. గురువారం డివిజన్‌లోని పారిశుధ్యంపై జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్లు, పారిశుధ్య కార్మికులతో సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం, సోమవారం డివిజన్‌లో బోనాలు జరుగుతున్న ఆలయాలు, బస్తీలు, కాలనీలలో చెత్త, మట్టికుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయాల వద్ద రోడ్ల మరమ్మతు



మరమ్మతుపనులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

చిక్కడపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రానున్న బోనాల పండుగ సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని పలు ఆలయాలవద్ద రోడ్ల మరమ్మతు పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్, నాయకులు ఎర్రం శ్రీనివాస్‌గుప్త, ముచ్చకుర్తిప్రభాకర్, రవిశంకర్‌గుప్త, ఆనంద్‌కుమార్, ఇంజనీరింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది బాలకార్మికులకు విముక్తి

బర్కత్‌పుర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి రైలులో నగరానికి తీసుకొస్తున్న 8 మంది బాలకార్మికులను వారితోపాటు నలుగురు నిర్వాహకులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఆపరేషన్ ముష్కాన్‌లో భాగంగా కాచిగూడ రైల్వే స్టేషన్‌లో సీడబ్ల్యూసీ, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ తనిఖీలు నిర్వహిస్తుండగా గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో నలుగురు నిర్వాహకులు 8 మంది బాల కార్మికులను తీసుకుకొచ్చారు. బాలలను మోండా మార్కెట్ సమీపంలోని ఆశ్రుత ఓపెన్ సెంటర్‌కు తరలించామని, నిర్వాహకులు యూపీ రాష్ట్రానికి చెందిన హరికేష్‌కుమార్(22), పప్పుఖాన్(21), గూలం హుస్సేన్(23), అభిమన్యు సహాని(21)లను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రేపు ఇల్లందులో అరుణోదయ రాష్ట్ర సదస్సు

రాంనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అరుణోదయ రాష్ట్ర సదస్సును ఈ నెల 19వ తేదీన ఇల్లందులో నిర్వహిస్తున్నామని అరుణోదయ సంస్థ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షురాలు కోల స్వప్న తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారులకు ప్రజాసంపద పంచిపెడుతోందని ఆరోపించారు. కార్మిక, రైతాంగ వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించేందుకు సదస్సులో చర్చిస్తామన్నారు. అరుణోదయ కళాకారులు పెద్దఎత్తున ఈ సదస్సులో పాల్గొనాలని ఆమె కోరారు.

అంబర్‌పేట డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ బాపూనగర్ కాకతీయ వీధిలో కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. బస్తీలో నూతన సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన వారితో నిర్వాహకులు

నాలుగు తరాల బాంధవ్యంపై పోటీలు

చిక్కడపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మూడు తరాల మధ్య బాంధవ్యం బాగుండేవిధంగా పెద్దలకు పిల్లలు సాయపడుతూ వార్ధక్యంలో వారికి తోడుగా ఉండేలా రెండోతరం వారూ మూడో తరంవారూ కూడా సహకారం అందించాలని హెరిటేజ్ ఫౌండేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గురువారం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్దలను గౌరవించేవిధంగా విభిన్న పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ తరహాలో చిక్కడపల్లిలోని మోడర్న్ హైస్కూల్‌లో ఎయిడెడ్ స్కూల్ పిల్లలకు ఉపాధ్యాయులకు, విచ్చేసిన మూడు నాలుగు తరాల పెద్దలు, పిల్లలమధ్య పోటీలు నిర్వహించారు. బహుమతులు అందజేసి వారికి భోజనం ఏర్పాటు చేశారు.

బూస్టర్‌తో లోప్రెషర్ నీటి సరఫరాకు చెక్



బూస్టర్ ఏర్పాటును పరిశీలిస్తున్న వాటర్‌వర్క్స్ మేనేజర్ సుప్రజ

కవాడిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ వినాయకనగర్ నెలకొన్న లోప్రెషర్ నీటి సరఫరాను అరికట్టేందుకు నూతనంగా బూస్టర్ ఏర్పాటు చేసినట్లు దోమలగూడ సెక్షన్ మేనేజర్ సుప్రజ అన్నారు. కొంతకాలంగా దోమలగూడ వినాయక్ నగర్‌లో లోప్రెషర్ నీటి సరఫరాతో తాగునీరు సరిగా రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మేనేజర్ సుప్రజ నీటి సరఫరాలో ప్రెషర్ పెంచేందుకు బూస్టర్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. గురువారం వినాయక్‌నగర్‌లో ఏర్పాటుచేసే బూస్టర్ నిర్మాణ పనులను బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేష్, ఎస్సీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పి.పరశురాం, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, ప్రధానకార్యదర్శి బొల్ల రమేష్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, పరిమళ్‌కుమార్, గద్దె శ్రీనివాస్, వాటర్‌వర్క్స్‌సిబ్బందితో కలిసి పరిశీలించారు.

ఎప్పుడైనా ఎక్కడైనా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తాం

గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ పి.వెంకటలక్ష్మి



డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న గాంధీనగర్ సీఐ వెంకటలక్ష్మి, ఎస్ఐలు

కవాడిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసు కమిషనర్, జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు మద్యం మత్తులో వాహనాలు నడిపి, అనేక ప్రమాదాలకు కారణమవుతున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ పి.వెంకటలక్ష్మి తెలిపారు. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రి సమయాల్లోనే కాకుండా ఉదయం సమయాల్లో ఎప్పుడైనా ఎక్కడైనా డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు టాఫిక్ సీఐ చెప్పారు. గురువారం పీఎస్ పరిధిలోని రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపే వారికి చలాన్లు విధించామన్నారు. మైనర్లకు కూడా వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కల్తీ కల్లు పేరుతో కల్లును నిషేధించే కుట్రలు

బర్కత్‌పుర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు పేరుతో కల్లును నిషేధించడానికి కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ ఆరోపించారు. తెలంగాణ సంస్కృతిలో కల్లు ఒక భాగం అని కల్లును నిషేధిస్తే సహించేది లేదన్నారు. గురువారం కాచిగూడలో గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావుల కిరణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూకట్‌పల్లిలో కల్తీకల్లు తాగి మరణించిన నిరుపేదలకు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఈ సంఘటనలకు బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సెక్రటరీ జనరల్ సిద్ధిరాముగౌడ్, జాతీయ ప్రధానకార్యదర్శి బాల్‌రాజ్‌గౌడ్, జాతీయఅధికార ప్రతినిధి సురేష్‌గౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యం నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

ఆశీర్‌ఖానా ఉత్సవాలకు ఏర్పాట్లు



ఆశీర్‌ఖానా వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న సయ్యద్ పర్వేజ్

ముషీరాబాద్, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన ఆశీర్‌ఖానా దర్గా ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఉత్సవాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్‌పర్వేజ్ విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఆశీర్‌ఖానా వద్ద అధికారులు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ కమిటీనాయకులు మోహిన్, సలీం, జాహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్ల ఆధునికీకరణ



పీఅండ్‌టీ కాలనీ కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రజలకు శుభకార్యాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రతి కాలనీ, బస్తీల్లో కమ్యూనిటీ హాల్స్‌ను నిర్మిస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో రూ.30లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ ముఖద్వార నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లను ప్రజల అవసరాలకు అనుకూలంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకొస్తున్నాం అన్నారు. పీ అండ్ టీ కాలనీ కమ్యూనిటీ హాల్ చాలారోజులుగా పెండింగ్‌లో ఉందని, త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, సీనియర్ నాయకులు బింగి నవీన్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, గోవింద్‌రాజ్, బీసీసెల్ డివిజన్ అధ్యక్షుడు ఉమాకాంత్, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, డివిజన్ యూత్ కమిటీ అధ్యక్షుడు కేఎం.సాయి, సోషల్ మీడియా ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్, పీఅండ్‌టీ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, లత తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

చిక్కడపల్లి: పేదప్రల ఆరోగ్యం కోసం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. చిక్కడపల్లికి చెందిన జాక్సన్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆయన చికిత్సకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. దీంతో ఆయన కుటుంసభ్యులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సంప్రదించారు. ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ నిధికి సిఫార్స్ చేయడంతో రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. ఈ ఎల్‌వోసీని ముఠా గోపాల్ జాక్సన్ తల్లి ప్రభావతికి గురువారం అందించారు.

23న విద్యా సంస్థల బంద్ : పీడీఎస్‌యూ

నల్లకుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థి, ప్రజావ్యతిరేక విధానాలను తీసుకోవడం వల్ల అధికారం కోల్పోయిందని, దీంతో కేసీఆర్‌ను గద్దెదించే పోరాటాల్లో వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రధానపాత్ర పోషించాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అదే పద్ధతి కొనసాగిస్తుందని పీడీఎస్‌యూ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాసంస్థల బంద్ వాల్‌పోస్టర్‌ను పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు మంద నవీన్, కంచనపల్లి శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు లెనిన్, సంఘం నాయకులు రాకేష్, హరీష్, కె.గణేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. నెహ్రూనగర్ పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సుందర్‌నగర్ పరిధిలో 11.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు, సీసీష్రాఫ్ పరిధిలో 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి'

చిక్కడపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. అమలు కాని హామీలు, ఆర్డినెన్స్‌ల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో విలేకరులతో మాట్లాడారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు కావాలంటే ఈ అంశాన్ని రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చేలా పార్లమెంటు ద్వారా చట్టం రూపొందించేందుకు కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి పెంచాలని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు.

స్త్రీహక్కులు, స్వేచ్ఛపై 'గుడిపాటి' రచనలు

చిక్కడపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): 20వ శతాబ్దంలో స్త్రీహక్కులు, స్వేచ్ఛపై రచనలు చేసినవారు గుడిపాటి వెంకటాచలం అని సాహితీకిరణం సంస్థ నిర్వాహకులు పొత్తూరి సుబ్బారావు అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గురువారం సుప్రసిద్ధ రచయిత గుడిపాటి వెంకటాచలం యాదిలో కార్యక్రమం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి, జర్నలిస్ట్ దేవసేన, అవోపా హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు పీఎస్ఆర్ మూర్తి, సుబ్బు మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్, గాయకుడు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కథక్ కళాక్షేత్ర వార్షికోత్సవం

చిక్కడపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కథక్‌కళాక్షేత్ర వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన కథక్ నృత్యకళాకారులు రోహన్‌దహల్, సుబ్రత్ సర్కార్, గురు యోగిని ఖనోర్కర్ శిష్యబృందం కథక్ నృత్యాంశాలను ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను అభినందించి సన్మానించారు. యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో హాస్యావధాని శంకరనారాయణ, నృత్యగురువు నిర్మలాప్రభాకర్, చంద్రశేఖర్, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను అభినందిస్తున్న అతిథులు